# వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- నిర్మల్ డీఎంహెచ్‌వో రాజేందర్
- వైద్య సిబ్బందితో సమావేశం



నిర్మల్‌చైన్‌గేట్ : మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రాజేందర్

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 13: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్ అధికారులను ఆదేశించారు. నిర్మల్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వైద్య సిబ్బందితో సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రాపిడ్ ఫీవర్ సర్వేను నిర్వహించాలన్నారు. వ్యాధులు అధికంగా ప్రబలిన చోట ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు చికిత్స అందించాలని ఆదేశించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి మంగళ, శుక్రవారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి రాజేందర్ అన్నారు. నిర్మల్‌లోని జోహార్‌నగర్‌లో చేపడుతున్న డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ దోమల వల్ల కలిగే వ్యాధులు, కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, పగిలిపోయిన రంజన్లు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కొబ్బరిబొండాలు, పగిలిపోయిన కుండలు తొలగించాలన్నారు. కూలర్లలో నీటిని తొలగించి వారానికి ఒకసారి నింపుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకుడు భోజారెడ్డి, ఆరోగ్య సహాయకుడు సాయినాథ్, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నార్నూర్, జూన్ 13 : పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అదనపు డీఎంహెచ్‌వో కుడ్మెత మనోహర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ముస్లిం వార్డులో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ముస్లిం వార్డును అదనపు డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మి, హెచ్‌ఈవో తులసి, నాందేవ్, హెల్త్ సూపర్ వైజర్ చరణ్‌దాస్, సత్తవ్వ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని కాపాడిన పోలీసులు


వీడియోలో మాట్లాడుతున్న మహ్మద్ పైసల్

ఎదులాపురం, జూన్ 13 : ఆత్మహత్యకు పాల్పడే ప్రయత్నంలో ఉన్న ఓ యువకుడిని ఆదిలాబాద్ పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి రక్షించారు. కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన ఆదిలాబాద్‌లోని రవీంద్రనగర్‌కు చెందిన మహ్మద్ పైసల్ అనే యువకుడు గురువారం రాత్రి తన తండ్రికి '' నాన్న సెలవు'' అంటూ వీడియో సందేశం పంపించి, అనంతరం తన సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. యువకుడి తండ్రి ఆందోళన చెంది వెంటనే ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ బీ సునీల్ కుమార్ వెంటనే స్పందించి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతని ఆఖరి స్థానాన్ని గుర్తించి, తాంసి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డాడి ప్రాజెక్టు వద్ద బాధితుని ఉనికిని నిర్ధారించారు. కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా తాంసి డయల్ 100, బ్లూకోర్టు, వన్‌టౌన్ సిబ్బంది వడ్డాడి ప్రాజెక్టుకు చేరుకుని యువకుడిని సురక్షితంగా గుర్తించి రక్షించారు. తర్వాత అతడిని తండ్రికి అప్పగించినట్లు వన్‌టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బాధిత యువకుడి కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ జిల్లా పోలీసుల సేవలను అభినందించారు. తక్షణం స్పందించి తమ కుమారుని ప్రాణాలు కాపాడిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, తాంసి డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బందికి తండ్రి అబ్దుల్ రాజాక్ కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ఎంపీపీ జన్మదిన వేడుకలు


మాజీ ఎంపీపీకి కేక్ తినిపిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 13 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొని మాజీ ఎంపీపీకి కేకు తినిపించి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగ్, నాయకులు రాథోడ్ రవీందర్, పండరి, రాథోడ్ సురేందర్, పాండు, రాజశేఖర్, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఇంటర్ బోర్డు సభ్యులు

దిలావర్‌పూర్, జూన్ 13 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఇంటర్మీడియట్ బోర్డు స్పెషన్ అధికారి భీంసింగ్ సందర్శించారు. కళాశాలలోని అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని, ప్రస్తుతం ఉన్న అడ్మిషన్లల్లో 30 శాతం పెంచాలని అధ్యాపకులను ఆదేశించారు. ప్రతి అధ్యాపకునికి టార్గెట్ ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆయన వెంటా జిల్లా మాధ్యమిక అధికారి పరశురాం, ప్రిన్సిపాల్ సుదర్శన్ ఉన్నారు.

## భూరికార్డు ఇప్పించాలని తహసీల్దార్‌ను కోరిన రైతు

బాసర, జూన్ 13 : 1958 సంవత్సరంలో తమ 22 గుంటల భూమి రికార్డులు అందించాలని శుక్రవారం తహసీల్దార్ పవన్ చంద్రకు ఓ రైతు విన్నవించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా శుక్రవారం బాసరలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ పవన్‌చంద్ర పాల్గొన్నారు. గ్రామానికి చెందిన బలరం భాస్కర్ అనే రైతు కొన్ని ఏళ్లుగా తాము 22 గుంటల భూమిని సాగు చేస్తున్నామని, కాని ఇప్పటి వరకు తమకు ఎలాంటి సరైన రికార్డులు లేవని కావున ఇప్పించాలని విన్నవించుకున్నారు. ఈ మేరకు దరఖాస్తు అందించగా ఆర్ఐ అభిమన్యు తీసుకొని రైతులు రసీదును అందజేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణ

ఎదులాపురం, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతోందని విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకుడు (ఆర్‌జేడీ) సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని పాత బస్టాండ్ ఏరియాలో గల యూపీఎస్ మరాఠీ మీడియం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించి, వారికి పాఠ్య పుస్తకాలతో పాటు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. ముందుగా సరస్వతీ దేవి చిత్రపటం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అడ్మిషన్లు పెంపొందిస్తూ మూతపడిన పాఠశాలలను తిరిగి ప్రారంభిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ విద్య సంస్థల్లో నాణ్యమైన లభిస్తుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆయన వెంట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, కోఆర్డినేటర్ సుజాత్ ఖాన్, మరాఠీ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేశ్, ఉపాధ్యాయులు, డీఈవో సీసీ రాజేశ్వర్ ఉన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి, అంకోలి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌జేడీ సత్యనారాయణ, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముస్లింలపై కాంగ్రెస్ చిన్న చూపు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సోన్, జూన్ 13: కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను చిన్నచూపు చూస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కొండాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం సీనియర్ నాయకులు ఖాజా అక్రమ్ అలీ, రిజ్వాన్‌ఖాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణలో ఒక ముస్లింకు కూడా చోటు దక్కలేదని మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ హైకమాండ్ ఆలోచించి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ నయిమ్, మసూద్‌ఖాన్, జుబేర్, మౌజుద్ పాల్గొన్నారు.

## దొంగ వస్తువులు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు

ఎదులాపురం, జూన్ 13 : దొంగలించిన వస్తువులను కొనుగోలు చేస్తున్న స్క్రాప్ దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాపర్ వైర్లు, సబ్‌మర్సిబుల్ మోటార్లు, వాహనాలు, వాటి విడిభాగాలు కొనుగోలు చేసే సమయంలో యజమానుల ఒరిజినల్ గుర్తింపు, ఆధారాలను తనిఖీ చేయాలని సూచించారు. దొంగ వస్తువులు కొనుగోలు చేసిన ఘటనలపై గత నెలలో పలు కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు గత కొద్ది రోజులుగా స్క్రాప్ దుకాణాలపై తనిఖీలు ముమ్మరం చేసినట్లు డీఎస్పీ చెప్పారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 4వ తేదీన సమీర్ హుస్సేన్ బొక్కల్ గూడ, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఒకరు ఖుర్షిద్‌నగర్‌కు చెందిన షేక్ ముజాహిద్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## జోరు వర్షం.. తీవ్ర నష్టం

ఎదులాపురం, జూన్ 13 : నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పిడుగు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇంద్రవెల్లి, జూన్ 13: ఇంద్రవెల్లి మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడగా, తీగలు తెగిపోయాయి. వ్యవసాయ భూములోని పెద్దపెద్ద చెట్లు ఈదురు గాలులతో నెలకొరిగాయి. అదేవిధంగా నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలోని టేకు చెట్లు నెలకొరిగాయి.

# యువకులపై దాడి : ఐదుగురిపై కేసు, ఇద్దరి అరెస్ట్

ఎదులాపురం, జూన్ 13 : ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ సమీపంలో ఇద్దరు యువకులపై జరిగిన దాడికి సంబంధించి పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరంలో పాల్గొన్న ఒక మైనర్‌ను జ్యువెనైల్ హోమ్‌కు పంపినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం షేక్ అజీజ్ తన సోదరుడు అజీమ్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా, అమేన్ అనే వ్యక్తి అజీజ్‌పై ఉమ్మేశాడు. దీనిపై అజీజ్ సోదరుడు అమేన్ అభ్యంతరం చెప్పగా, అమేన్ ఆగ్రహంతో అపశబ్దాలు చేస్తూ అక్కడి నుంచి బైక్‌పై వెళ్లిపోయాడు. కొద్ది సేపటికే బషీర్ కిరాణా దుకాణం ఎదుట షేక్ అజీజ్ ఉన్న సమయంలో, మళ్లీ అక్కడికి వచ్చిన అమేన్ ఆయన బైక్‌ను ఢీకొట్టి, కీతో కొట్టాడు. దీంతో పాటు నాహీద్, అర్బాజ్, ఒక మైనర్ షేక్ అజీజ్‌ను చేతులతో కొట్టారు. అనంతరంఅజీజ్ సోదరుడు షేక్ అజీమ్ పాత బస్టాండ్ వైపు బైక్‌పై వెళ్తుండగా నాహీద్, మైనర్, జాహీద్ అతనిపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో ఆయన తలకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావమైందని బాధితుడు పోలీసులకు తెలిపాడు. చికిత్స నిమిత్తం రిమ్‌కు వెళ్లిన అజీమ్, అనంతరం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అమీన్, జహీద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మైనర్‌ను నిజామాబాద్ జ్యువెనైల్ కోర్టుకు తరలించగా జ్యువైనల్ హోమ్‌కు తరలించారు. మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. దాడిలో ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## మట్కా నిర్వాకుడిపై కేసు

బేల, జూన్ 13 : ఆదిలాబాద్ జిల్లా బేలలోని హోటల్ వద్ద మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఒక వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్ఐ నాగ్‌నాథ్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రసవార్ సందీప్ మట్కా నిర్వహిస్తుండగా అతడిని పట్టుకొని రూ.10270 నగదుతో పాటు ఒక ఫోన్, మట్కా చిట్టిలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

## కబ్జాకు గురవుతున్న చెరువును కాపాడాలి

కడెం, జూన్ 13 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామ సమీపంలో కబ్జాకు గురవుతున్న చెరువును కాపాడాలని మత్స్యకార సంఘం నాయకులు, రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి

భైంసా, జూన్ 13 : ప్రైవేట్ పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఏఎంవీఐ దూప్ సింగ్ అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసాలోని పలు బస్సులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ బస్సులలో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటివి తప్పకుండా ఉండాలన్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. బస్సులు సక్రమంగా లేనిచో వాటిని సీజ్ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

బాసర, జూన్ 13 : విద్యార్థులు ఎల్లప్పుడూఏ ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫేసర్ గోవర్ధన్ అన్నారు. శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణాత్మక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రమ, ఆత్మవిశ్వాసం, సమయ నిర్వాహణ, వంటి విలువైన విషయాలపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిజ జీవిత విజయ గాథలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డాక్టర్ మహేశ్, డాక్టర్ విఠల్, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎంతగానో అవసరం

విద్యార్థులకు కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎంతగానో అవసరమని ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్ అన్నారు. శుక్రవారం ఆర్జీయూకేటీలో లిఖిత కమ్యూనిఖేషన్ సామర్థ్యాలను పెంపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని అవగాహన కలిపంచారు. సరైన భాషతో, వ్యాకరణ శైలీ, ఫార్మాట్ లోపం లేకుండా రాసేలా లేఖ నమూనాలను రూపొందించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫేసర్ మురళీదర్శన్, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, ఇంగ్లిష్ విభాగాధిపతి అప్సింగర్ విజయ్, ఇంగ్లిష్ విభాగ అధ్యాపకులు, ఇతర విభాగాల అధిపతులున్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ

తాంసి(భీంపూర్), జూన్ 13 : భీంపూర్ మండలంలోని కరంజి(టీ) మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీ శివ్వన్న అనారోగ్యంతో ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ శుక్రవారం ఆయనకు కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్ఎస్ నాయకులు గంగయ్య, నరేందర్, కేదారేశ్వర్ రెడ్డి, రఘు ఉన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, జూన్ 13 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌కు (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) తొమ్మిది నెలల ఉచిత శిక్షణకు బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్ www. tgbcstudycircle. cgg.gov.inలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను వచ్చే నెల 12వ తేదీన నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు 25 జూలై 2025 నుంచి 30 ఏప్రిల్ 2026 వరకు హైదరాబాద్ సైదాబాద్, లక్ష్మీనగర్ కాలనీలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 08732221280నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎదులాపురం, జూన్ 13 : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మగ్గం వర్క్, బ్యూటీపార్లర్, హౌజ్ వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, టూ వీలర్ మెకానిక్, ఫొటోగ్రఫీ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎండీ గౌస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాలలోపు పదో తరగతి ఉత్తీర్ణులు, ఫెయిలైన నిరుద్యోగ యువతీ, యువకులు ఆధార్‌కార్డు, తెల్ల రేషన్‌కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా పాస్‌బుక్ జిరాక్స్, 4 ఫొటోలతో ఉట్నూర్‌లోని కుమ్రంభీం కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9949412159ను సంప్రదించాలని సూచించారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత

బోథ్, జూన్ 13: ధ్యానంతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందని సొనాల వైద్యాధికారి నవీన్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా సొనాలలోని పీహెచ్‌సీలో ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్ మునిగెల యోగిత దవాఖానా సిబ్బందికి, గ్రామస్తులకు ధ్యానం చేయించారు. కార్యక్రమంలో సొనాల దవాఖానా సూపర్‌వైజర్ కవిత, సంధ్య, ఫార్మసీ ఆఫీసర్ మనోహర్, నర్సింగ్ ఆఫీసర్ చంద్రకళ, జమున పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ, జూన్ 13: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 100 రోజుల టీబీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, ఆశకార్యకర్త రమాదేవి పాల్గొన్నారు.

## వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

నేరడిగొండ, జూన్ 13 : వర్షాకాలంలో గ్రామాల్లో మురుగు నీరు నిలువ ఉండకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రమేశ్ అధికారులను సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని గ్రామ పంచాయతీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఉట్నూర్, జూన్ 13: ఆదిలాబాద్ జిల్లాలోని గాదిగూడ, బేల మండలాల్లో పిడుగుపాటుకు ఆరుగురు మృతి చెందడం చాలా బాధకరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని ఆయన మాట్లాడారు. పిడుగు పాటుతో రైతులు మరణించడం దురదృష్టకరం అన్నారు. ప్రభుత్వం తరపున వారి కుటుంబాలను ఆదుకుంటామన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## క్షతగ్రాతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

నార్నూర్, జూన్ 13 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం పిప్రి గ్రామంలో పిడుగుపాటుకు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్, పెసా చట్టం కోఆర్డినేటర్ దేవ్‌రావ్ వైద్య సిబ్బందిని కోరారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిడుగుపాటుకు తొమ్మిది మందికి గాయాలయ్యాయి. బాధితులను నిత్యం పర్యవేక్షిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను కోరారు. ఇక్కడ లింగు, సంతోష్, హరీశ్, జగపతి ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ఉట్నూర్ రూరల్, జూన్ 13 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ గ్రామంలో పెందూర్ ప్రభాకర్‌కు చెందిన ఆవు మేతకు వెళ్లిన సమయంలో గ్రామ సమీప చేనులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్‌వైర్ తగిలి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారి విజయ్ కుమార్ పంచనామ నిర్వహించారు. కరెంట్ షాక్‌తో మృతి చెందిందని నిర్ధారించారు. ఆవు నిండు గర్భిణీ దాని విలువ రూ. 50 వేల వరకు ఉంటుంది తెలిపారు. తనకు నష్ట పరిహారం ఇవ్వాలని బాధితుడు కోరుతున్నాడు.

## డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 13: నిర్మల్ జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు జాతీయ కార్యాచరణ ప్రణాళిక పథకం కింద డిస్ట్రిక్ట్ డీ- అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి, అర్హత ఉన్న ఎన్జీవోల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న సంస్థలు ఈ అనుదాన్ (http://grants-msje.gov.in/ngo-login) portal లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా కలెక్టర్ సముదాయ భవనంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ప్రతిపాదనలు ఈ నెల 30వ తేదీ వరకు పంపించాలని కోరారు.

## విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచండి

నిర్మల్ అర్బన్, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని డీఈవో రామారావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్‌లోని మంజులాపూర్ , వైఎస్సార్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, సుమలత, ఖలీద్, సింధూజ, నిఖిల్, రజనీకాంత్ మంజులాపూర్ ప్రధానోపాధ్యాయులు కవిత రాణి, సుధీర్, ఉమా మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

ఎదులాపురం, జూన్ 13: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ బల్దియా సమావేశ మందిరంలో వైద్య, మున్సిపల్, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్పల్లి వార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజు, జిల్లా మెప్మా కోఆర్డినేటర్ శ్రీనివాస్, అర్బన్ పట్టణ ప్రాంతంలోని మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందికి, శానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా వాడకం తగ్గించాలి

బోథ్, జూన్ 13 : రైతులు యూరియా, రసాయన మందుల వాడకం తగ్గించాలని ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహాన్ అన్నారు.సొనాలలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ బీ రాజేశ్వరి, డాక్టర్ జీ మంజులత, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సుధాకర్ రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత విద్య

దస్తురాబాద్, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లోనే కార్పొరేట్ స్థాయిలో ఆంగ్ల మధ్యమంలో ఉచిత విద్య అందుతుందని ఎంపీడీవో రమేశ్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత పుస్తకాలను, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట వేణు, ఉపాధ్యాయులు, ఐఆర్పీలు జగన్, ఉదయ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

దస్తురాబాద్, జూన్ 13 : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నదని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని బుట్టపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సును శుక్రవారం ఆయన సందర్శించారు. భూ సమస్యలపై రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ ఆర్తీ, సిబ్బంది, రైతులు ఉన్నారు.

కడెం, జూన్ 13: కడెం మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు జేసీ కిశోర్ కుమార్ హాజరయ్యారు. పలువురు రైతులు భూ సమస్యల గురించి దరఖాస్తులు చేసుకోగా సంబంధిత దరఖాస్తులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని బస్సులపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 13 : ఫిట్‌నెస్, నిబంధనలు పాటించని పాఠశాల బస్సులపై చర్యలు తీసుకోవాలని నవ తెలంగాణ విద్యార్థి పరిషత్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ శుక్రవారం నిర్మల్ ఆర్టీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు హైమద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పున:ప్రారంభమైన దృష్ట్యా ప్రైవేట్ బస్సుల్లో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, బస్సులో ఫస్ట్ ఎయిడ్‌కిట్, డ్రైవర్ హెల్త్ సర్టిఫికెట్, అగ్నిప్రమాద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయాలని కోరారు. ఇక్కడ జిల్లా కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి వేముల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రాజు ఉన్నారు.

## సెల్‌ఫోన్ పోతే ఆందోళన చెందకండి

నిర్మల్ అర్బన్, జూన్ 13: సెల్‌ఫోన్ పోయిన, దొంగలించబడిన ఆందోళన చెందవద్దని నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసి 88 ఫోన్లను బాధితులకు అందజేశారు. ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జి సమ్మయ్య, ఆర్ఐ రాంనిరంజన్ పాల్గొన్నారు.

## రసాయన ఎరువులు వాడొద్దు

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 13: రైతులు రసాయన ఎరువులు తక్కువగా వాడాలని ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ రఘువీర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు పురుగు మందులు, గడ్డి మందుల రసీదులను భద్రంగా ఉంచుకోవాలన్నారు. సాగునీటి ఆదా చేయడం, పంట మార్పిడి పద్ధతి పాటించడం, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడడం వంటి వాటిపై చర్చించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రద్ధరాణి, ఏఈవో రోషిణి పాల్గొన్నారు.

## వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

బాసర, జూన్ 13 : బాసర గోదావరి నది వద్ద శుక్రవారం ఆత్మహత్యకుయత్నించిన మహిళను పోలీస్ కానిస్టేబుల్ మోహన్‌సింగ్ కాపాడాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వృద్ధ మహిళ ఇంట్లో గొడవ పడి ఆత్మహత్య చేసుకోవడానికి గోదావరి వద్దకు రాగా గమనించి కానిస్టేబుల్ మోహన్‌సింగ్ ఆమె వద్దకు వెళ్లి విచారించాడు. ఆత్మహత్య కోసం వచ్చిందని గుర్తించి వెంటనే పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

కడెం, జూన్ 13 : గత 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని పలు గ్రామాలకు చెందిన రైతులు కోరారు. శుక్రవారం కడెం మండలంలోని లక్ష్మీసాగర్, పాండ్వాపూర్ గ్రామాల్లో భూ భారతి కార్యక్రమాన్ని నిర్వహించగా రైతులు అధికారులకు పలు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ డబ్బులు వెచ్చించి భూములను చదును చేసుకున్నామని, 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములలో అటవీ అధికారులు ట్రెంచ్ వేయడం దారుణమని అన్నారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే తమపై అటవీ అధికారులు ఇలాంటి ఘటనలకు పాల్పడడంపై మండిపడ్డారు. ఇప్పటికైన తమకు హక్కు పత్రాలు ఇచ్చి, భూములు తిరిగి ఇవ్వాలని కోరారు.

## ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

భైంసా, జూన్, 13 : ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని డీఐఈవో పరశురాం అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ఆయన మాట్లాడారు. గత సంవత్సరం 270 అడ్మిషన్లు ఉన్నాయని, ఈ సంవత్సరం 340 వరకు పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట భీంసింగ్, సత్యపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ శివరంజని రెడ్డి ఉన్నారు.

## హత్య కేసులో రిమాండ్

లోకేశ్వరం, జూన్ 13 : మంత్రాలు చేస్తున్నాడని అనుమానంతో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం నగర్ గ్రామానికి చెందిన గడ్డం పోసులు(64) ను సిమెంట్ ఇటుకతో కొట్టి చంపిన గడ్డం గంగాధర్, గడ్డం సాయిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ముథోల్ సీఐ మల్లేశ్, లోకేశ్వరం ఎస్ఐ అశోక్ తెలిపారు. హత్య జరిగిన 12 గంటల లోపు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినందు కు పోలీసులను ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాశ్ కుమార్ అభినందించారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఇంద్రవెల్లి, జూన్ 13: ఇంద్రవెల్లి మండలంలోని శంకర్‌గూడ సమీపంలో ప్రధాన రోడ్డుపై రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన మస్కే రామేశ్వర్(25) మృతి చెందాడు. ఎస్ఐ సాయన్న తెలిపిన ప్రకారం...హర్కాపూర్ ఆంధ్‌గూడ గ్రామానికి చెందిన మస్కే మారుతి, విమల దంపతుల కుమారుడు రామేశ్వర్(25) ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఈ నెల 11న ఇంద్రవెల్లికి చెందిన షేక్ సాజిద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్‌కు వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికివస్తున్న సమయంలో శంకర్‌గూడ సమీపంలో గుర్తు తెలియని కారు ఢీ కొనడంతో మస్కే రామేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండంతో అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి విమలబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఒకరి అదృశ్యం

సోన్, జూన్ 13: సంగంపేట్ గ్రామానికి చెందిన గజ్జల రమేశ్ ఈ నెల 10వ తేదీన అదృశ్యమైనట్లు ఎస్ఐ గోపి తెలిపారు. రమేశ్ ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బేల, జూన్ 13 సైద్‌పూర్ గ్రామ సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సుకు వెనుక భాగంలో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైద్‌పూర్ నుంచి గాదిగూడ మండలం పిప్రి గ్రామానికి వెళ్తుండగా ప్రమాదంలో మడాబి బొజ్జు, ఆత్రం లచ్చు, సిడాం ముత్తులకు గాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.